క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

నస్రుల్లాబాద్: తనపై నమ్మకంతో బీర్కూర్ ఏఎంసీ చైర్మన్ పదవి అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ సురేశ్ షెట్కర్‌కి ఏఎంసీ చైర్మన్ శ్యామల కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం అంకోల్ క్యాంపులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు అందుబాటులో ఉంటూ ఏఎంసీ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానన్నారు. ఆమె వెంట పొల్స విఠల్, పెర్క శ్రీనివాస్, మహేశ్, వెంకట రమణ, సాయిలు,సక్రు, శ్రీనివాస్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



కామారెడ్డి రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సరంపల్లి సింగిల్ విండో డైరెక్టర్ బక్కన్నగారి రాజు సూచించారు. మున్సిపల్ పరిధిలోని సరంపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆకుల రవికుమార్, ముల్కరాజు, రాజగోపాల్, హన్మాండ్లు, శ్యాంరావు, శ్రీనివాస్, సాయిలు, శేఖర్, రాజు, సొసైటీ సీఈవో మోహన్‌రావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లారీల కోసం రైతుల ఆందోళన



నిజాంసాగర్: ధాన్యం బస్తాల తరలింపునకు లారీలు రావడం లేదంటు శుక్రవారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని గున్కుల్ సొసైటీని తుంకిపల్లి, తుర్కపల్లి గ్రామాల రైతులు ముట్టడించారు. ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయాలు చేసినా ధాన్యం బస్తాలు రైస్ మిల్లులకు తరలించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైస్ మిల్లుల నిర్వాహకులతో మాట్లాడి లారీలు వచ్చేలా చూస్తామని సొసైటీ చైర్మన్ వాజిద్అలీ రైతులకు నచ్చజెప్పారు. సొసైటీకి తరలి వచ్చిన వారిలో రైతులు రౌతు రాజు, సాతెల్లి శ్రీనివాస్, లింగాల రవీందర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి ఊరేగింపు



భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డిలో అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి అయ్యప్ప దీక్షాపరులు శుక్రవారం ఊరేగించారు. గ్రామస్తులు, భక్తులు రథానికి మంగళహారతులు ఇచ్చి పూజలు చేశారు.

మన్మథ స్వామి ఆలయ దర్శనానికి పాదయాత్ర



నిజాంసాగర్: బిచ్కుంద మఠాధీశులు సోమయ్యప్ప ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని మన్మథ్ స్వామి దర్శన పాదయాత్రలో శుక్రవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. నెక్నూర్ నుంచి కపిల్ దార్ వరకు పాదయాత్ర చేపట్టారు. దైవభక్తి మార్గంలో యువత ముందుండాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఆలయంలో అన్నదానం

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ తెలిపారు. ఎల్లారెడ్డిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో దీక్షాపరులకు భిక్ష ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి రాజేందర్ నాథ్, గురుస్వాములు నాగేశ్వర్‌రావు, కృష్ణారెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.


కామారెడ్డి: గర్గుల్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో..


మాచారెడ్డి: అక్కాపూర్‌లో తులసి పూజలో భక్తులు


జిల్లా కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో..


దోమకొండ గడి కోటలో..


కామారెడ్డి: సరస్వతి ఆలయంలో..


మహమ్మద్‌నగర్ శివాలయంలో..


భిక్కనూరు: శ్రీసిద్ధరామేశ్వరాలయంలో..


భిక్కనూరు: జంగంపల్లిలో..

వైభవంగా కార్తీక పౌర్ణమి పూజలు

శివపార్వతులకు ప్రీతికరమైన కార్తీక పౌర్ణమిని జిల్లా వ్యాప్తంగా భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఉపవాస దీక్ష చేపట్టి, పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాలకు తరలివెళ్లారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఆలయాలు కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులతో కిటకిటలాడాయి. దీపాలంకరణతో ఆలయాలను ముస్తాబు చేశారు. భక్తులు ఆలయాల్లో శివపార్వతులను భక్తిశ్రద్ధలతో పూజించారు. పలు ఆలయాల్లో భక్తులు సత్య నారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు.

–సాక్షి నెట్‌వర్క్


బాన్సువాడ: తాడ్కోల్‌లో దీపారాధన చేస్తున్న మహిళలు


మద్నూర్: సలాబత్‌పూర్‌లో..


నస్రుల్లాబాద్ సత్యనారాయణ వ్రతం చేస్తున్న భక్తులు


సదాశివనగర్ శివాలయంలో..


కామారెడ్డి: లింగాపూర్‌లో ..


కామారెడ్డి: వేంకటేశ్వరస్వామి ఆలయంలో..


పెద్దకొడప్‌గల్ పాపహరేశ్వర ఆలయంలో.


బీబీపేటలో నగరేశ్వరాలయంలో జ్వాలా తోరణం


బీబీపేటలో శివలింగం ఆకృతిలో దీపాలంకరణ


రాజంపేట: సాయిబాబా ఆలయంలో..


కామారెడ్డి అభయాంజనేయ స్వామి ఆలయంలో జ్వాలా తోరణం

గురుకులంలో బిర్సా ముండా జయంతి



నస్రుల్లాబాద్: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో మేరా యువ భారత్ కార్యక్రమంలో భాగంగా నెహ్రూ యువ కేంద్రం, సేవా సంఘ్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో బిర్సా ముండా జయంతిని నిర్వహించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో గిరిజనులకు నాయకత్వం వహించిన వారిలో బీర్సా ముండా ముఖ్యులు అని గిరిజన విద్యార్థి సంఘం నాయకుడు నరేశ్ రాథోడ్ అన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర్ సంఘటన్ వలంటీర్ సునీల్ రాథోడ్, ప్రిన్సిపాల్ మాధవరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఎన్యుమరేటర్లకు పనిభారం తగ్గించాలి’

కామారెడ్డి అర్బన్: సమగ్ర కుల గణనలో ఎన్యుమరేటర్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు పనిభారంతో మానసిక సంఘర్షణకు గురవుతున్నారని తెలంగాణ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దుబాసి నరేందర్ శుక్రవారం పేర్కొన్నారు. సమయం తక్కువ సమాచార సేకరణ ఎక్కువ కావడంతో పది ఇళ్లను సర్వే చేయడానికి ఉదయం నుంచి సాయంత్రం అవుతుందన్నారు. ఉన్నత పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు, సిలబస్ పూర్తి చేసిన సబ్జెక్ట్ టీచర్లను ఎన్యుమరేటర్లుగా నియమించి పనిభారం తగ్గించాలని కోరారు.

ధర్మసమాజ్ పార్టీని బలోపేతం చేయాలి

సదాశివనగర్: ధర్మసమాజ్ పార్టీని అన్ని గ్రామాల్లో బలోపేతం చేయాలని ఆ పార్టీ ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఉత్తునూర్ గ్రామంలో పార్టీకి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించి, నూతన కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం


సావళిలో ప్రచారం చేస్తున్న కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ: తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. శుక్రవారం దెగ్లూర్ నియోజకవర్గంలోని బిలోలి తాలూకలోని సావళి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలు మహారాష్ట్రలో అమలు చేయాలని అక్కడి ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు బోనస్, రుణమాఫీ తదితర పథకాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని అన్నారు. మహారాష్ట్రలో ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ నేతలు శంకర్ పటేల్, వసీంఫారూక్, ఇమ్రాన్, సలీం, సురేశ్ బాబా, నేమాని బుజ్జి, మూర్తి, సాయిలు, షకీల్ తదితరులు ఉన్నారు.

సమాచారం..

● నేటి నుంచి నిత్యాన్నదానం

భిక్కనూరు: మండల కేంద్రంలోని హరిహర సుత అయ్యప్ప స్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి జనవరి 20వ వరకు నిత్యాన్నదాన ప్రసాద భిక్ష కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు అయ్యప్ప అన్నదాన సేవా సమితి ట్రస్టు అధ్యక్షుడు కేవీ సుబ్బారావు గురుస్వామి పేర్కొన్నారు. గురువారం భిక్కనూరులో విలేకరులతో మాట్లాడుతూ.. ఆలయంలో అయ్యప్ప స్వాములతో పాటు హన్‌మాన్, శివ మాల ధరించిన స్వాములకు కూడా అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో పెద్దబచ్చగారి శ్రీనివాస్‌రెడ్డి, గూడెం ఆనంద్‌కుమార్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

లింగంపేట: తరుగు పేరిట రైతులను మోసం చేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలం నుంచి మాచారెడ్డి మండలంలోని భవానిపేటలోని రైస్‌మిల్లుకు 702 బస్తాల ధాన్యం తరలిస్తే 696 బస్తాలు రాసినట్లు తెలిపారు. రైతులకు 7 బస్తాలు తరుగు పేరిట కోత విధించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తరుగు పేరిట రైతలను మోసం చేస్తున్న రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కాసుల బాల్‌రాజ్, భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ: మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని రాజారాం దుబ్బాలో అంబేద్కర్ విగ్రహాన్ని డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. పోచారం భాస్కర్‌రెడ్డి తన సొంత నిధులతో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించడం హర్షనీయమని అన్నారు. నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో మహనీయుల విగ్రహాలను పోచారం శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒక్క బుడగ జంగం కులస్తులకే 40 డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇచ్చిన ఘనత పోచారం శ్రీనివాస్‌కే దక్కిందని అన్నారు. ఇంకా ఎవరైనా ఇళ్లు లేని పేదలు ఉంటే ప్రభుత్వం అమలు చేసే ఇందిరమ్మ పథకం కింద నిధులు మంజురు చేస్తామని అన్నారు. అంబేడ్కర్ విగ్రహ దాత పోచారం భాస్కర్‌రెడ్డికి బుడగ సంఘం మహిళలు మంగళహారతులతో ఘనంగా స్వాగతించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నర్సింలు, గంగుల గంగారాం, మధుసూదన్ రెడ్డి, ఎజాస్, ఖలేక్, ప్రశాంత్, సాయిలు, మన్నే చిన్న సాయిలు తదితరులు ఉన్నారు.

కామారెడ్డిలో పుస్తక ప్రదర్శన



కామారెడ్డి అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ప్రదర్శనలో భాషా సాహిత్యం, సాంస్కృతిక చైతన్యానికి సంబంధించిన పుస్తకాలను ఉంచడంతో పాఠకులను ఆకర్షించింది. చిన్నప్పటి నుంచి పిల్లలను గ్రంథాలయాలకు తీసుకురావడం వల్ల పాఠనశక్తి పెంపొందించవచ్చని చైర్మన్ పేర్కొన్నారు. గ్రంథాలయ సంస్థ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

‘అభివృద్ధికి అడ్డుపడుతున్న ఎమ్మెల్యే’


పాల్వంచలో మాట్లాడుతున్న రమేశ్‌గౌడ్

మాచారెడ్డి: అధికారులను బెదిరిస్తూ అభివృద్ధికి అడ్డుపడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి తీరు మార్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ పాల్వంచ మండల అధ్యక్షుడు పల్లె రమేశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పాల్వంచలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే అధికారులను ఇబ్బందులకు గురిచేయడంతో వారు తమ విధులను సక్రమంగా చేసుకోలేక పోతున్నారని అన్నారు. ఎమ్మెల్యే వేధింపులతో నియోజకవర్గంలోని చాలా మంది అధికారులు తమ విధులకు సెలవు పెట్టి వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముందు ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సొంతంగా మేనిఫెస్టో విడుదల చేసి తన సొంత నిధులతో చేస్తానన్న అభివృద్ధి ఎక్కడని ప్రశ్నించారు. సమగ్ర సర్వేలో ప్రజలు తమ వివరాలు తెలియజేసి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇంతియాజ్, భూమయ్య, మజార్, సమర సింహారెడ్డి, భూపతిరెడ్డి, శంకర్, అంజయ్య, మహేశ్, నర్సింలు, నరేశ్, బుచ్చయ్య, రాజు ఉన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

కామారెడ్డి రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేస్తామని చేసిన హామీని సీఎం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న చేపట్టే ‘చలో ఇందిరా పార్క్’ ధర్నాను విజయవంతం చేయాలని ఎస్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ కోరారు. శుక్రవారం ఆయన కామారెడ్డి జిల్లా కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు రాములు, చిరంజీవి, కాళీదాస్, లింగం, శ్రీనివాస్, శైలజ, మాధవి, భక్తమాల, మాధవి, సాయిరెడ్డి, కవిత, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి



బీబీపేట: రాబోయే ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ వర్క్ షాప్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ చేపడుతున్న పథకాలు, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించాలని సూచించారు. నరసింహ చారి, రంజిత్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే నివాసంలో అక్షరాభ్యాసం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డికి చెందిన న్యాయవాది కాత్యం సిద్ధిరాములు తన మనుమరాలు అక్షరాభాస్యాన్ని శుక్రవారం దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే దంపతులు నివసించిన పుణేలోని వారి స్వగృహంలో చేయించారు. న్యాయవాది సిద్ధిరాములు బిడ్డ వెన్నెల–సృజన్‌ల కుమార్తె సృవిధతో తల్లిదండ్రులు అక్షరాలు రాయించారు. 1848లో ఆడపిల్లలకు తొలి పాఠశాలను ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే నివాసంలో తన మనవరాలితో అక్షరాభాస్యం చేయించడం సంతోషం ఉందని సిద్ధిరాములు, కుటుంబసభ్యులు అన్నారు.

సంక్షిప్తం

సెల్‌ఫోన్ల అప్పగింత

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పీఎస్ పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ముగ్గురికి సెల్‌ఫోన్లను అందించినట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం పేర్కొన్నారు. ఎల్లారెడ్డికి చెందిన కలీమొద్దీన్, సాయిలు, రవి సెల్‌ఫోన్లు పోగొట్టుకొని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ నుంచి సెల్‌ఫోన్ల ఆచూకీని కనుగొని బాధితులకు అందించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సన్మానం



బాన్సువాడ: పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాన్సువాడకు చెందిన జంగం గంగాధర్‌ను బీసీ సంక్షేమ సంఘం నేతలు శుక్రవారం ఘనంగా సన్మానించారు. బాన్సువాడ మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న జంగం గంగాధర్ పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అనంతరం గంగాధర్‌ను బాన్సువాడ బీసీ సంక్షేమ సంఘం నేతలు సన్మానించారు. కార్యక్రమంలో బీసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వనం గంగాధర్, సభ్యులు సాయిరాం, సంజీవ్ తదితరులు ఉన్నారు.

గోమాతకు అంత్యక్రియలు

లింగంపేట: మండలంలోని పొల్కంపేటలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గోమాతను హతమార్చిన ఘటన శుక్రవారం కలకలం రేపింది. గ్రామానికి చెందిన చాకలి కాంతమయ్య తన పశువుల కొట్టంలో ఆవును కట్టేయడంతో దుండగులు గొడ్డలితో నరికి హత్య చేశారు. విషయం తెలుసుకున్న భజరంగ్‌దళ్ సభ్యులు గ్రామానికి చేరుకొని గోమాత పార్థివ దేహానికి పూలమాలలు వేశారు. అనంతరం గ్రామ శివారులో ఖననం చేశారు. భజరంగ్‌ధళ్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఏఈలు



బాన్సువాడ: బాన్సువాడ టౌన్ ట్రాన్స్‌కో ఏఈగా సంతోష్ కుమా ర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన నాందేవ్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఎల్లారెడ్డిలో కమర్షియల్ సెక్షన్‌లో విధులు నిర్వహించిన సంతోష్ కుమార్ పదోన్నతిపై బాన్సువాడకు వచ్చారు. అనంతరం నూతన ఏఈకి లైన్‌మన్‌లు అభినందనలు తెలిపారు.

బీబీపేటలో..



బీబీపేట: మండల విద్యుత్ శాఖ ఏఈగా విజయ్ భాస్కర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో సబ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహించి ఇటీవల పదోన్నతుల్లో భాగంగా ఏఈగా పదోన్నతి పొంది బీబీపేటకు వచ్చారు. గతంలో పని చేసిన ఏఈ దివ్యగాయత్రి బాన్సువాడకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో విజయ్‌భాస్కర్ వచ్చారు. ఆయనను విద్యుత్ శాఖ సిబ్బంది ఘనంగా సన్మానించారు.